క్లుప్తంగా

రాంపురంలో క్రికెట్ పోటీలు ప్రారంభం



పెబ్బేరు: మండలంలోని రాంపురంలో ఆర్పీఎల్–2 క్రికెట్ పోటీలను శుక్రవారం ఎస్‌ఐ జగదీశ్వర్ ప్రారంభించారు. శ్రీరామనవమి, హనుమాన్ జయంతి వేడుకలు పురస్కరించుకొని ఈ పోటీలు నిర్వహించినట్లు క్రికెట్ ఆర్గనైజర్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు రామ్మోహన్‌రెడ్డి, నాగరాజు, శరవయ్య, సత్యనారాయణరెడ్డి, గోకారి, ఎంకే మూర్తి, కొండల్, చంద్రశేఖర్‌రెడ్డి, తిరుపతి, గోపాలకృష్ణ, అంజి, రాజేష్‌రెడ్డి, మల్లేష్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం అందజేత

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలం దొడగుంటపల్లిలో దాతల సహకారంతో నిర్మిస్తున్న శివాలయ అభివృద్ధి కోసం గ్రామానికి చెందిన కీ.శే.గోపాల్‌రెడ్డి కుమారులు ఈశ్వర్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి రూ.1.50లక్షలు విరాళంగా అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామస్తులందరూ తమ శక్తి మేర ఆలయ నిర్మాణం కోసం విరాళాలు అందజేయాలని నిర్వాహకులు కోరారు.

జామీయా మసీదులో ఇఫ్తార్



అమరచింత: పట్టణంలోని జామీయా నిజామియా మసీదులో శుక్రవారం ఉపవాస దీక్షాపరులకు పట్టణానికి చెందిన జావీద్ ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. అనంతరం పవిత్ర ప్రార్థనలో ప్రపంచంలోని ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. ఇఫ్తార్‌లో మసీద్ కమిటీ అధ్యక్షుడు ఆయూబ్‌ఖాన్, మౌలానా అల్తాఫ్‌బేగ్, కమిటీ సభ్యులు ఖాజాహుస్సేన్, అన్సారీ, ఖదీర్, తౌఫిక్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



అమరచింత: కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉండి అన్ని విధాలుగా ఆదుకుంటామని పీసీసీ అధికార ప్రతినిధి నాగరాజ్‌గౌడ్, నారాయణ పేట డీసీసీ అధ్యక్షుడు వాకిటి శ్రీహరి, రాష్ట్ర నాయకులు ప్రశాంత్‌రెడ్డి, పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఆత్మకూర్ మండలంలోని పిన్నంచర్లకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు అంజనేయులు మృతి చెందడంతో శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ.. పార్టీ ఎదుగుదల కోసం కృషి చేసిన ఆంజనేయులు మృతి పార్టీకి తీరని లోటన్నారు. ఈమేరకు వారి కుటుంబానికి సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో ఆయూబ్ ఖాన్, మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, గంగాధర్ గౌడ్, రహమతుల్లా తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

కోడేరు: మండలంలోని బావాయిపల్లికి చెందిన కృష్ణయ్యకు రూ.18,000, శేషమ్మకు రూ.52,000 ప్రభుత్వం నుంచి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ఆదేశాల మేరకు సర్పంచ్ కర్రెమ్మ బాధితులకు చెక్కులను పంపిణీ చేశారు.

ఘనంగా వీరభద్రస్వామి రథోత్సవం



కోయిల్‌కొండ: మండలంలో ప్రసిద్ధి చెందిన వీరభద్రక్షేత్రంలో శుక్రవారం తెల్లవారుజామున బ్రహ్మోత్సవాలు కనుల పండువగా నిర్వహించారు. రథోత్సవాన్ని తిలకించేందుకు గురువారం రాత్రి నుంచే భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నందికోళ్ల సేవతో నిర్వహించారు. అనంతరం భక్తులు రథాన్ని ఊరేగించారు. భక్తులకు మరికల్ మండలానికి చెందిన శివకుమార్ అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

ప్రేమను పంచడమే క్రీస్తు మార్గం

అమరచింత: ఇతరుల పట్ల ప్రేమ, దయ, కరుణను కలిగి ఉండటమే ఏసుక్రీస్తు చూపించిన మార్గమని పాస్టర్ హ్యాపీపాల్ అన్నారు. గుడ్ ఫ్రైడేను పురస్కరించుకొని శుక్రవారం అమరచింతలోని ఎంబీ కర్మేల్ చర్చిలో ప్రత్యేక ఆరాధన కార్యక్రమాలను నిర్వహించారు. ఈమేరకు ఏసుక్రీస్తుకు శిలువ వేసిన సందర్భంగా పలికిన ఏడు ప్రవచనాలను తెలియచేశారు. ప్రతి ఒక్కరూ ప్రేమను కలిగి ఉండాలని, శత్రువులను ప్రేమించాలని బోధించారు. మానవ రక్షణ కోసం దేవుడి నుంచి వేరుపడి తనను తాను బలిగా అర్పించుకున్నారని పాస్టర్లు తెలిపారు. ఏసుక్రీస్తు పాపులైన మానవుడికి అండగా నిలిచి, వారిని విశ్వసించి వారి కుటుంబాల్లో వెలుగు నింపాడన్నారు. సంఘంలో జీవించే ప్రతి ఒక్కరూ దేవుడి దృష్టిలో సమానమే అన్న విషయాన్ని గుర్తించుకోవాలని సూచించారు. సంపాదించిన ధనంలో ఏడాదిలో పదోవంతు పేదవారి క్షేమం కోసం ఖర్చు చేయాలని క్రీస్తు సూచించారన్నారు. ఆకలితో ఉన్న వాడికి అన్నం పెట్టి వారి బాధను దూరం చేయడమే క్రీస్తు నిజమైన మార్గమన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ చైర్మన్ జేపీ లూథర్, సంఘ ఉపాధ్యక్షుడు లేమ్యూలల్ రాజ్, ప్రధాన కార్యదర్శి దీనకుమార్, కోశాధికారి ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్‌లో..

ఆత్మకూర్ మండలంలోని మూలమళ్ల, ఖానాపురం, జూరాలతో పాటు పలు గ్రామాల్లో గుడ్ ఫ్రైడే పర్వదినాన్ని క్రైస్తవులు ఘనంగా జరుపుకొన్నారు. ఆయా గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఏసు క్రీస్తు శిలువ ధరించిన విషయాలను, బైబిల్ ప్రవచనాలను పాస్టర్లు వినిపించారు.

వీపనగండ్ల: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో శుక్రవారం గుడ్ ఫ్రైడే పర్వదినాన్ని క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. తూంకుంట, గోవర్ధనగిరి, కల్వరాల చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు దాతలు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.



అమరచింతలో ప్రార్థనలో పాల్గొన్న క్రైస్తవులు



గోవర్ధనగిరిలో..



ఏసు ప్రవచనాలు వినిపిస్తున్న పాస్టర్

పల్లె పల్లెకు బీజేపీ పథకాలు తీసుకెళ్లాలి



పెబ్బేరులో..



వనపర్తిలో ఇంటింటి ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

వనపర్తి క్రైం: ప్రధాని మోడీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పల్లెపల్లెకు తీసుకెళ్లాలని ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బి.శ్రీశైలం అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని 31వ వార్డులో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని మోడీ రెండోసారి అధికారంలోకి వచ్చాక పేదల అభ్యున్నతికి అనేక పథకాలు తీసుకొచ్చి అమలు చేశారని, వాటిని ప్రజలకు చేరేవిధంగా కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కుమారస్వామి, కార్యదర్శి పరశురాం, అధికార ప్రతినిధి బచ్చురాం, పట్టణ అధ్యక్షుడు రామ్మోహన్ తదితరులు ఉన్నారు.

పెబ్బేరు: సికింద్రాబాద్ పరేడ్స్ గ్రౌండ్‌లో శనివారం నిర్వహించనున్న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సభను విజయవంతం చేయాలని శుక్రవారం బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ దేశంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి రూ.వేల కోట్ల నిధులు మంజూరు చేస్తున్నారని తెలిపారు. పథకాల అమలు, అభివృద్ధి పనులు చేస్తుంటే ఓర్వలేక బీజేపీ నాయకులపై తప్పుడు ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు దగ్గరపడ్డాయని జోస్యం చెప్పారు. హైదరాబాద్‌లో పలు అభివృద్ధి పనులను శంకుస్థాపన, అనంతరం భారీ బహిరంగ సభ నిర్వహించనున్న నేపథ్యంలో కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నారాయణ, వేమారెడ్డి, గోనేల సహదేవుడు, రాఘవేంద్రగౌడ్, కంచె అంజనేయులు, భగవంతు యాదవ్, నాగరాజు యదవ్, వెంకటస్వామి పాల్గొన్నారు.

వాకపల్లి గిరిజన మహిళల పోరాటం స్ఫూర్తిదాయకం

పాన్‌గల్: ఉమ్మడి విశాఖపట్టణం జిల్లా జి.మాడుగుల మండలం వాకపల్లికి చెందిన 11 మంది గిరిజన మహిళల 16ఏళ్ల సుదీర్ఘ న్యాయ పోరాటం, జడ్జీ ఇచ్చిన తీర్పు స్ఫూర్తిదాయకమని భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు కళావతమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2007 ఆగస్టు 20న కూంబింగ్ కోసం వచ్చిన పోలీసులు తమపై అత్యాచారం చేశారని 11 మంది గిరిజన మహిళలు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారన్నారు. సుదీర్ఘ విచారణ అనంతరం జడ్జీ తీర్పు చెబుతూ జిల్లా న్యాయాధికార సేవా సంస్థ నుంచి బాధిత మహిళలకు నష్టపరిహారం ఇప్పించాలని, విచారణలో కేసును నీరుగార్చిన అధికారులను విచారించాలని కోర్టు ఆదేశించింది. గిరిజన మహిళలు నైతిక విజయం సాధించారని ఆమె ప్రశంసించారు.

జ్ఞానంతో కూడిన శక్తి అంబేడ్కర్



వనపర్తి క్రైం: అంబేడ్కర్ జ్ఞానంతో కూడిన శక్తి అని సాహితీకళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని రేడియంట్ హైస్కూల్‌లో బొర్రా గోవర్ధన్ రచించిన 'శీల శిఖరం' అనే గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ఒక జ్ఞాన వికాసమని, గత కాలపు తప్పులను సరిదిద్ది కొత్త సమాజ నిర్మాణం కోసం జీవితమంతా కృషి చేసిన మహనీయుడు అని కొనియాడారు. అంబేడ్కర్ నిత్య జీవితంలో అనేక విషయాలను వివరించిన గ్రంథం శీల శిఖరం అని అన్నారు. కార్యక్రమంలో బైరోజు శ్యాంసుందర్, బందారు శ్రీను, నారాయణరెడ్డి, చంద్రశేఖర్, రాములు నిరంజనయ్య, నాగరాజు తదితరులు ఉన్నారు.

రైతుల ఇబ్బందులు పాలకులకు పట్టవా?

పాన్‌గల్: రైతుల ఇబ్బందులను పట్టించుకోని పాలకులకు వచ్చే ఎన్నికల్లో ఓటు ద్వారా గుణపాఠం చెప్పాలని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ డా.పగిడాల శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మండలంలోని కేతేపల్లిలో ఇంటింటికీ టీడీపీ కార్యక్రమంలో ఆయన ప్రతి ఇల్లు తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేయడంతో పాటు గతంలో టీడీపీ అధికారంలో ఉండగా అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొల్లాపూర్ నియోజకవర్గంలో కేఎల్‌ఐ, భీమా కాల్వల ద్వారా సాగునీరు నిలిచిపోవడంతో యాసంగిలో సాగు చేసిన పంటలు ఎండుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నియోజకవర్గ నాయకులు పంటలు ఎండిపోకుండా చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తామని హామీలు ఇచ్చి విస్మరించడంతో రైతులకు నష్టాల పాలవుతున్నారన్నారు. రైతులకు రుణమాఫీ చేస్తామని నేటికీ అమలు కాలేదని దీంతో వడ్డీలు పెరిగిపోతున్నాయన్నారు. కార్యక్రమంలో డా.సాయిధీరజ్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ సుధాకర్, రామస్వామియాదవ్, గోపాలకృష్ణ, రామకృష్ణ, మైబూషి, కుర్మయ్య, రామేశ్వర్‌యాదవ్ పాల్గొన్నారు.



కరపత్రాలను పంపిణీ చేస్తున్న నాయకులు

అంధకారంలో అమరచింత బస్టాండ్

అమరచింత: మున్సిపాలిటీ కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ అంధకారంలో మగ్గుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. నెల రోజుల నుంచి బస్టాండ్‌లో రాత్రి పూట కరెంటు సౌకర్యం లేక విద్యుత్ బల్బులు వెలగడం లేదు. దీంతో సాయంత్రం ఏడు గంటలకే బస్టాండ్ పరిసరాలు చీకటితో అలుముకుంటున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి పట్టణానికి వస్తున్న ప్రయాణికులు చీకటిగా ఉన్న బస్టాండ్‌లో నిలవలేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితులు దాపురించాయి. అంధకారంలో ఉండటంతో చీకట్లో బస్టాండ్‌లో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా మారుతుందని సమీప కాలనీ ప్రజలు ఆరోపిస్తున్నారు. వనపర్తి డిపో మేనేజర్ బస్టాండ్‌ను సందర్శించినపుడు, బస్టాండ్ రూపురేఖలు మార్చి ప్రయాణికులకు సౌకర్యాలు మెరుగుపరుస్తామని ఇచ్చిన హామీ కలగానే మిగిలింది. విద్యుత్ వసతినే కల్పించలేని అధికారులు ప్రయాణికుల కోసం సౌకర్యాలు ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అమరచింత పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో రాత్రివేళలో వెలుగులు నింపాలని ప్రయాణికులతో పాటు ప్రజలు కోరుతున్నారు.



విద్యుత్ వెలుగులు లేక అంధకారంలో బస్టాండ్

ఇసుక రీచ్‌ల పరిశీలన

అడ్డాకుల: మండలంలోని ఇసుక రీచ్‌లను శుక్రవారం తహసీల్దార్ కిషన్ పరిశీలించారు. మండలంలోని గ్రామాల్లో ప్రభుత్వ పనులకు ఇసుక అవసరాలను తీర్చేందుకు మన ఇసుక–మన వాహనం కోసం కందూర్, పొన్నకల్ శివారులోని పెద్దవాగును అధికారులు పరిశీలించారు. వాగులో ఇసుక లభ్యత ఉన్న ప్రదేశాలను పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. అదేవిధంగా వాగులోకి వాహనాలు వెళ్లే దారులను చూశారు. గురువారం మండల సర్వసభ్య సమావేశంలో స్థానిక అవసరాలకు ఇసుక తరలించుకునేలా ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేయాలని కందూర్ సర్పంచ్ శ్రీకాంత్ విజ్ఞప్తి చేయడంతో అధికారులు వాగును పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నర్ర శ్రీనివాస్, కందూర్ సర్పంచ్ వి.శ్రీకాంత్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

భక్తుల ఇలవేల్పు మునిరంగస్వామి

- నేటి నుంచి నందిమళ్లలో జాతర
- మన్యంకొండ వేంకటేశ్వరస్వామికి ప్రతిరూపంగా పూజలు



మునిరంగస్వామి మూలవిరాట్



నందిమళ్లలోని చింతలముని రంగస్వామి ఆలయం

అమరచింత: మండలంలోని నందిమళ్లలో వెలసిన చింతల మునిరంగస్వామి జాతర శనివారం నుంచి ప్రారంభమవుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తుల పాలిట కొంగు బంగారమై కోరిన కోర్కెలు తీర్చే దైవంగా పూజలందుకుంటున్న చింతల మునిరంగస్వామి ఉత్సవాలను ఏడాది కనుల పండువగా నిర్వహించడం ఇక్కడి భక్తుల ఆనవాయితీ. మన్యంకొండలో వెలసిన వేంకటేశ్వరస్వామి ప్రతిరూపంగా ఇక్కడి ప్రజలు చింతల మునిరంగస్వామిని కొలిచి నైవేద్యాలు సమర్పిస్తారు. వారంరోజుల పాటు జరిగే ఉత్సవాల్లో ప్రభోత్సవం, రథోత్సవం ప్రధాన ఘట్టాలని ఆలయ నిర్వాహకులు వెల్లడించారు. భక్తులు వివిధ ప్రాంతాల నుంచి నందిమళ్లకు వచ్చి ఇక్కడ కొండపై వెలసిన మునిరంగస్వామి ఆలయంలో ప్రత్యేక పూజ లను నిర్వహించి మొక్కులు చెల్లించుకుంటారు.

మాంసంతో నైవేద్యాలు

చింతల మునిరంగస్వామి జాతరకు వస్తున్న భక్తులు నైవేద్యంగా మాంసహారం సమర్పించడం ఆనవాయితీ. ఉత్సవాలకు వస్తున్న భక్తులు మొదటగా బెల్లంతో తీపి వంటకాలు తయారు చేసి స్వామివారికి సమర్పిస్తారు. అనంతరం అక్కడే పొటేళ్లు, కోళ్లను బలిస్తూ కందూర్లు నిర్వహించి తమ మొక్కులను చెల్లించుకుంటారు.

సందేపురాళ్ల పోటీలు

జాతర సందర్భంగా వివిధ గ్రామాల నుంచి వస్తున్న భక్తుల కోసం నిర్వాహకులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే యువకుల కోసం సందేపురాళ్ల పోటీలను నిర్వహించనున్నారు. ఆదివారం సందేరాళ్ల పోటీలను నిర్వహిస్తున్నామని, యువకులు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. మొదటి బహుమతిగా రూ.8వేలు, రెండో బహుమతిగా రూ.5వేల నగదు బహుమతులను నందిమళ్ల హమాలిసంఘం ఆధ్వర్యంలో అందిస్తున్నారు.

ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ

కొత్తకోట: మండలంలో భూత్పూర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం హాథ్ సే హాథ్ జోడో యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కాటం ప్రదీప్‌కుమార్ ఉపాధి పనులు చేస్తున్న కూలీల దగ్గరకి వెళ్లి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరించారు. అలాగే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే చేపట్టబోయే సంక్షేమ పథకాలు, రూ. 5లక్షలతో ఇందిరమ్మ ఇల్లు కట్టిస్తామని, రూ. 500లకే వంట గ్యాస్, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.5 లక్షల ఉచిత వైద్యం, ఒకేసారి రూ. 2 లక్షలు రుణమాఫీ తదితర వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, మహేష్, అక్కి రాఘవేంద్రగౌడ్, నరోత్తంరెడ్డి, బంగారయ్య, చంద్రాయుడు, శ్రావణ్‌కుమార్, వెంకటేశ్వర్‌రెడ్డి, పెద్ద నాగన్న, శేఖర్, కృష్ణయ్య, బుచ్చన్న, రాంబాబు, శివ, బాలరాజు, గంగాధర్, కొండల్, రవి, గిరి, రాజు, మహేష్, ధర్మందర్, మహేష్, చంద్రకాంత్, తదితరులు పాల్గొన్నారు.



కూలీలతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

సర్పంచ్ వెంకటస్వామికి అండగా బీఎస్పీ

కొత్తకోట రూరల్: పెద్దమందడి సర్పంచ్ వెంకటస్వామిసాగర్‌కు చెందిన భూమిని బీఆర్‌ఎస్ నాయకులు జగదీశ్వర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి అక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని బీఎస్పీ నాయకులు మండిపడ్డారు. అలాగే సర్పంచ్ వెంకటస్వామి, అతని కుటుంబ సభ్యులపై వారు భౌతిక దాడులకు పాల్పడుతున్నారని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు చెన్నరాములు ఆరోపించారు. శుక్రవారం సర్పంచ్ వెంకటస్వామిని పెద్దమందడిలో ఆయన ఇంటి వద్ద వారు పరామర్శించారు. అనంతరం చెన్నరాములు మాట్లాడుతూ సర్పంచ్ వెంకటస్వామిపై మరోసారి దాడి చేస్తే ఊరుకునేది లేదని, బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లామని చెన్నరాములు తెలిపారు. అధికార పార్టీకి చెందిన నాయకుల అరాచకాలు హద్దు లేకుండా పోయాయని, వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో తిరుమలేష్, మన్నెం, వసంత్, కె.గోపాల్, సుభాష్‌చంద్ర, బాలరాజు, సాయి, నర్సింహ్మా, బండలయ్య తదితరులు పాల్గొన్నారు.



వెంకటస్వామిని పరామర్శిస్తున్న చెన్నరాములు

బీఎస్పీ మండల అధ్యక్షుడి ఎన్నిక..

పెద్దమందడి బీఎస్పీ మండల అధ్యక్షుడిగా బి.కృష్ణను ఏకగ్రీవంగా ఎన్నిక చేసి నియామక పత్రాన్ని అందజేసినట్లు జిల్లా పార్టీ అధ్యక్షుడు చెన్నరాములు తెలిపారు. బీఎస్పీ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చెన్నరాములు సూచించారు.

బీసీల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయండి

పెబ్బేరు: జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో ఈ నెల 9న నిర్వహిస్తున్న బీసీల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని బీసీ నాయకులతో కలిసి పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో బీసీలపై దాడులు ఎక్కువయ్యాయని, ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెట్టించి వేధిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయ నాయకులు బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుంటూ జెండాలు మోసే కార్యకర్తలుగా, జిందాబాద్‌లు కొట్టే కూలీలుగా చూస్తున్నారని వాపోయారు. అలాగే బీసీల ఆత్మగౌరవ సభకు బీజేపీ సంపూర్ణ మద్దతు ఇచ్చిందని, పార్టీలకతీతంగా అధిక సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణ, బీజేపీ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, రాఘవేందర్‌గౌడ్, సహదేవుడు, భగవంతు, అంజనేయులు, వెంకటస్వామి, నాగరాజు, దేవేందర్‌నాయుడు, మహేందర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను విడుదల చేస్తున్న బీసీ నాయకులు

నిరుద్యోగ భృతి ఇవ్వాలని కాగడ ప్రదర్శన

వనపర్తి క్రైం: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి కల్పించాలని వైఎస్సార్‌టీపీ రాష్ట్ర డిసిప్లినరీ సభ్యుడు, వనపర్తి నియోజకవర్గ కోఆర్డినేటర్ భూజల వెంకటేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీలపై వైఎస్సార్‌టీపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం నాయకులు జిల్లా కేంద్రంలోని రాజీవ్‌చౌరస్తా నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు కాగడాల ప్రదర్శన చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నిరుద్యోగుల ఆత్మబలిదానాలతో ప్రత్యేక తెలంగాణ సాధించుకున్నామని, నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తాయని నమ్మించిన సీఎం కేసీఆర్ అధికారంలోకి వచ్చాక ఆ ఊసే మరిచారని విమర్శించారు. ఉద్యోగాల నోటిఫికేషన్ ఇచ్చినప్పటికీ, భర్తీ చేపట్టడంలో ప్రభుత్వం విఫలమయ్యిందన్నారు. రాష్ట్రంలో 1.91లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, వెంటనే వాటిని భర్తీ చేయాలని కోరారు. పేపర్ లీకేజీలతో నిరుద్యోగుల పరిస్థితి అయోమయంగా మారిందని, వారి కోసం వైఎస్సార్‌టీపీ అధినేత షర్మిల దీక్షలు చేపట్టారన్నారు. నిరుద్యోగ భృతి కల్పిస్తామని, ఇంటికో ఉద్యోగం ఇస్తామని మాయ మాటలు చెప్పి నిరుద్యోగుల జీవితాలతో ఆటలు ఆడుకుంటున్నారని, వెంటనే ఇచ్చిన హామీలను నెరవేర్చాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు లింగారెడ్డి జశ్వంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, యూత్ అధ్యక్షుడు సతీష్ తదితరులు ఉన్నారు.



కాగడాల ప్రదర్శన చేపట్టిన వైఎస్సార్‌టీపీ నాయకులు

ఎవరిదీ తప్పు.. పడుతోంది తుప్పు

పాన్‌గల్: పోలీసులు నిర్వహించే తనిఖీల్లో అక్రమ రవాణాకు పాల్పడుతు, పత్రాలు లేని వాహనాలు ఎన్నో పట్టుబడ్డాయి. ఇలాంటి వాహనాలన్నీ పోలీసు స్టేషన్ ఆవరణలో మూలకు పడి ఉన్నాయి. వాటి అమ్మకానికి టెండర్లు కూడా నిర్వహించకపోవడంతో ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ తుప్పు పడుతున్నాయి. ఇలా స్టేషన్ ఆవరణలో ఏళ్లుగా ఉన్న పలు వాహనాలు తుప్పు పట్టి ఎందుకు పనికిరాని విధంగా తయారవుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఇటీవల స్టేషన్ సందర్శనకు వచ్చిన వనపర్తి డీఎస్పీ వాహనాలను పరిశీలించి వాటిపై ఆరా తీశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి స్టేషన్ ఆవరణలో పట్టుబడిన వాహనాలపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.



పాన్‌గల్ స్టేషన్ ఆవరణలో పట్టుబడిన వాహనాలను పరిశీలిస్తున్న డీఎస్పీ, ఎస్‌ఐ (ఫైల్)

మురుగు నిల్వతో ఇబ్బందులు

అమరచింత: పట్టణంలోని పదో వార్డులో గల జీఎస్ నగర్‌లోని కందకంలో మురుగు నిల్వ ఉండటంతో ఈగలు, దోమలు పెరిగి ప్రజలు రోగాల బారిన పడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. కాలనీలోని ఇళ్ల నుంచి వస్తున్న మురుగు కోసం ప్రత్యేకమైన కాల్వలను ఏర్పాటు చేయకపోవడంతో పాటు మురుగు కందకంలోకి వదులుతుండటంతో పరిసరాలు అపరిశుభ్రంగా తయారయ్యాయి. నిత్యం ఈగలు, దోమలతో సావాసం చేస్తున్న పరిస్థితులు దాపరించాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పందుల సంచారం సైతం విపరీతంగా ఉండటంతో విష జ్వరాల బారిన పడి ఆస్పత్రుల పాలయ్యే పరిస్థితులు నెలకొన్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగును తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కాలనీవాసులు కోరుతున్నారు.



జీఎస్ నగర్‌లోని కందకంలో దుర్గంధం

న్యాయం ఎప్పటికీ గెలుస్తుంది: బీజేపీ

పెంట్లవెల్లి: రాష్ట్రంలో దొరలపాలన సాగుతోందని, అధికారంలో ఉన్నామని ఇష్టానుసారంగా ప్రతిపక్ష నాయకులను అరెస్ట్ చేయడం నోరు మూయించడం బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి అలవాటు అయిపోయిందని బీజేపీ నాయకులు అన్నారు. రెండు రోజుల కిందట బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను అరెస్ట్ చేయడం ఎంతో అన్యాయమని, అందుకుగాను హన్మకొండ కోర్టులో బండిసంజయ్‌కు బెయిల్ మంజూరు చేయడాన్ని హర్షిస్తూ.. పెంట్లవెల్లిలోని బీజేపీ నాయకులు బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్‌చంద్ర మాట్లాడారు. ఇకపై రాష్ట్రంలో కల్వకుంట్ల కుటుంబ ఆటలు సాగవని బీజేపీ నాయకులు భరత్‌చంద్ర అన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్‌చంద్ర, పెంట్లవెల్లి మండల అధ్యక్షుడు ప్రతాప్, ఖలీల్, వెంకటస్వామి, వెంకటేష్ పాల్గొన్నారు.

